# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి:13 సంచిక:170 ఖమ్మం మంగళవారం, 24 మార్చి 2026 పేజీలు: 8 వెల: 1.00


## అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన దళిత బంధు నిధులు...?

భువనగిరి కలెక్టరేట్ : దళితుల అభివృద్ధి ధ్యేయంగా దళితుల ఆర్థిక స్వాలంబన కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంలో అధికారుల నిర్లక్ష్యంతో.లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు

# ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్: సీఎం రేవంత్

హైదరాబాద్: ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు.

''ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ.15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది.

నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం.

అభివృద్ధి విషయంలో అన్ని పార్టీల నేతలూ ఒక్కటవ్వాలి

ముందు జాగ్రత్త తీసుకోకుంటే దిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం.



ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలి'' అని కోరారు.



# పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది..

## లోక్‌సభలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 23: పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఇవాళ మధ్యాహ్నం రెండు గంటలకు ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు.

పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు.

ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వు ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు.

రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ప్లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు.

# మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట క్యూనెట్ మోసం.. సంచలన విషయాలు వెలుగులోకి..


హైదరాబాద్, మార్చి 23 క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం చేస్తోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మోసాలు చేస్తున్న క్యూనెట్ సంస్థపై దాడులు చేసి 32 మంది నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. ఈరోజు(సోమవారం) క్యూనెట్ కేసుకు సంబంధించి బషీర్‌బాగ్ సీసీఎస్‌లో సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. 1998 నుంచి క్యూనెట్ నిర్వాహకులు వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రొడక్ట్ ముందు చూపెడుతూ వెనకాల మోసం చేసి డబ్బులు దండుకోవడమే క్యూనెట్ సంస్థ నిర్వాహకుల టార్గెట్ అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించామని తెలిపారు. సిద్దిపేటలో హరికృష్ణ అనే బాధితుడు రూ.5 లక్షలు మోసపోయారని అన్నారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్యూనెట్ సంస్థ కార్యకలాపాలపై దృష్టిసారించామని చెప్పుకొచ్చారు. క్యూనెట్ సంస్థ చెప్పేది ఒక్కటని, చేసేది ఇంకొకటంటూ బాధితుడు సూసైడ్ నోట్ రాసి చనిపోయారని అన్నారు.



సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే టార్గెట్..

వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్స్, హెల్త్‌ఫుడ్స్ తయారీ పేరిట ప్రజల్లోకి వెళ్తూ ట్రాప్‌లోకి దించుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. క్యూనెట్ సంస్థలో చేరే వ్యక్తులకు ముందు ఇష్టపూర్వకంగా చేరుతున్నామని బాండ్ పేపర్లపై రాయించుకొన్న తర్వాతే ఈ సంస్థలోకి తీసుకుంటారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ వాళ్లకు ప్రొడక్ట్ చూపెట్టి సైడ్ ఇన్‌కమ్ పేరుతో ట్రాప్ చేస్తున్నారన్నారు. ఉద్యోగస్థులు పెట్టుబడి పెట్టడానికి డబ్బులు లేకపోతే వాళ్లే ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా ఇప్పించి అధికంగా డబ్బులు వసూలు చేశారని తెలిపారు. నెలరోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి పూర్తి స్థాయిలో ఆధారాలను సేకరించి అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 32 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నారని ప్రస్తావించారు. చాలామంది ఇండియన్ డైరెక్ట్ సెల్లర్స్‌గా ఏర్పడి బిజినెస్ చేస్తున్నారని అన్నారు. డైరెక్ట్ ప్రొడక్ట్ సెల్లింగ్ పేరుతో మనీ స్కాంలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసు.. నిందితులకు 3 రోజుల కస్టడీ



హైదరాబాద్: మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు నిందితులకు న్యాయస్థానం 3 రోజుల కస్టడీ విధించింది. రేపటి నుంచి 3 రోజుల పాటు కస్టడీకి అనుమతిస్తూ ఉప్పరపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, నమిత్‌శర్మను సిట్ అధికారులు విచారించనున్నారు.

# ఘోర ప్రమాదం: మాగంటి గోపీనాథ్ కుమార్తెలకు గాయాలు.. ఒకరికి సీరియస్

హైదరాబాద్, మార్చి 23 హైదరాబాద్ శివార్లలోని ఔటర్ రింగ్ రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జూబ్లీహిల్స్ దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుమార్తెలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో పెద్ద కుమార్తె పరిస్థితి విషమంగా ఉండగా, రెండో కుమార్తె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందగానే నార్సింగి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న (తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ) సమీపంలో నిన్న(ఆదివారం) అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గచ్చిబౌలి వైపు వస్తుండగా నార్సింగి సమీపంలో ఈ ఘటన జరిగింది. రోడ్డుపై ముందు వెళ్తున్న ఒక డీసీఎం వాహనాన్ని మాగంటి గోపీనాథ్ కుమార్తెలు ఉన్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో మొత్తం ముగ్గురు ఉన్నారు. అందులో మాగంటి గోపీనాథ్ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# గ్యాస్ కొరతపై ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

ఎల్బీనగర్, మార్చి 23 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం - కేంద్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఆడుతున్న ఈ దొంగ నాటకాల వల్లే ఇప్పుడు గ్యాస్ కొరత పరిస్థితి ఏర్పడిందని ఎల్బీనగర్ నియోజకవర్గ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.దానిలో భాగంగా సోమవారం ఎల్బీనగర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మాత్రం "గ్యాస్ సప్లై ఎక్కడా ఆగలేదు, అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి" అంటోంది. రాష్ట్ర ప్రభుత్వం అయితే "కేంద్రం నుంచి సరైన సరఫరా లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయి" అని చెబుతోంది.ఈ ఇద్దరి పరస్పర ఆరోపణల మధ్యలో సామాన్య ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరకక రోజువారీ జీవనంపై ఆధారపడే ఆటో డ్రైవర్లు, టిఫిన్ సెంటర్ యజమానులు, ఓల్డ్ ఏజ్ హోమ్స్ వంటి అనేక వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో, గ్యాస్ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో అమ్మడం జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇది నిజమైతే, అది పూర్తిగా అన్యాయం. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, సరఫరా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం, బాధ్యత వహించడం ప్రభుత్వాల బాధ్యత. అవసరమైన చోట బాధ్యత తీసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలి.ఐదు రాష్ట్రాల (అస్సాం, తమిళనాడు, వెస్ట్ బెంగాల్, పాండిచేరి, కేరళ) ఎన్నికల నేపథ్యంలో కేవలం 50 రూపాయలు మాత్రమే పెంచడం జరిగింది. ఈ ఎన్నికల నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ పైన ధరలు పెంచితే రాబోయే ఎలక్షన్లో ఇబ్బందికరమైన పరిస్థితి వస్తుందని ఎన్నికల తరువాత డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపైన భారీగా రేట్లు పెంచనున్న కేంద్ర ప్రభుత్వం.ఎన్నికలు అయిపోయిన వెంటనే మరో 50 రూపాయలు పెంచే యోజనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఈ దొంగ నాటకాలలో సామాన్య ప్రజలే నష్టపోతున్నారు.ఈ కార్యక్రమంలో గజ్జెల మధుసూదన్ రెడ్డి,అనంతుల రాజిరెడ్డి, బిచెనేపల్లి వెంకటేశ్వర్ రావు, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, జిట్టా రాజశేఖర్ రెడ్డి,పద్మ శ్రీనివాస్ నాయక్, సామ తిరుమల రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్,జిన్నారం విఠల్ రెడ్డి, సొంటి చంద్రశేఖర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, డివిజన్ల అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, సత్యం చారి,వరప్రసాద్ రెడ్డి,లింగాల రాహుల్ గౌడ్, చింతల రవికుమార్, శ్రీధర్ గౌడ్, రాజిరెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, చిరంజీవి, శ్రీశైలం యాదవ్, రోజారెడ్డి పలువురు ఉద్యమకారులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల ధిక్కార స్వరం.. రేపు 'ఛలో హైదరాబాద్'

* **బడ్జెట్‌లో మొండిచేయి.. హామీలు గాలికే!**
* **అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులపై ప్రభుత్వం నిర్లక్ష్యం**
* **ఐ అండ్ పీఆర్ కార్యాలయం ముట్టడికి టీడబ్ల్యూజేఎఫ్ పిలుపు**

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి) : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని, వివక్ష ధోరణిని నిరసిస్తూ ఈ నెల 25న రాష్ట్రవ్యాప్త జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్ ఐ అండ్ పీఆర్ కార్యాలయ ముట్టడి" కార్యక్రమం చేపట్టనున్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య ఈ మేరకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో పాత్రికేయుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు.

**బడ్జెట్‌లో ప్రాధాన్యం శూన్యం:**

ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమం ప్రస్తావనే లేకపోవడం దారుణమని సోమయ్య విమర్శించారు. కనీసం ఒక్క మాట కూడా చెప్పకపోవడం ప్రభుత్వం చూపుతున్న వివక్షకు నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, జర్నలిస్టుల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు.

**అపరిష్కృతంగానే ప్రధాన సమస్యలు:**

* ప్రభుత్వ వైఫల్యాల వల్ల పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఏకరువు పెట్టారు:
* అక్రెడిటేషన్లు: ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు గడిచినా కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయలేదు.
* వైద్య సేవలు: జర్నలిస్టులకు అత్యవసరమైన హెల్త్ కార్డుల పంపిణీలోనూ జాప్యం జరుగుతోంది.
* ఇళ్ల స్థలాలు: సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపిస్తూ ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ నుంచి ప్రభుత్వం తప్పుకుంటోంది.
* పదవీ విరమణ లబ్ధి: పొరుగు రాష్ట్రాల్లో పాత్రికేయులకు పెన్షన్లు ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఆ దిశగా అడుగులు పడటం లేదు.
* మీడియా అకాడమీ: అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ నియమించకపోవడంతో కార్యకలాపాలు కుంటుపడుతున్నాయి.

**చిన్న పత్రికలపై ఉక్కుపాదం**

ఆర్ఎన్ఐ (RNI), పీఆర్జీఐ (PRGI) గుర్తింపు పొందిన చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్‌ను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అణిచివేస్తోందని సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా అడ్వర్టైజ్‌మెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో ఆయా సంస్థలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపానల్మెంట్ ప్రక్రియ నిలిపివేయడం, అక్రెడిటేషన్లు ఇవ్వకపోవడం వంటి చర్యలతో చిన్న పత్రికల ఉనికిని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టే "ఛలో హైదరాబాద్" ఆందోళనలో రాష్ట్రవ్యాప్త జర్నలిస్టులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాముని చెరువుకు పునర్జీవం..!

* **క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ పర్యవేక్షణ.. పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి) : మూసాపేటలోని కాముని చెరువు పునరుద్ధరణ పనులపై హైడ్రా (HYDRAA) దృష్టిసారించింది. సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి చెరువు ప్రస్తుత పరిస్థితిని, జరుగుతున్న పనులను సమీక్షించారు. రెండో విడతలో భాగంగా పునరుద్ధరణకు ఎంపిక చేసిన 14 చెరువుల జాబితాలో కాముని చెరువు కూడా ఉంది.

**స్థానికుల ఇబ్బందులు - వినతులు**

పర్యటన సందర్భంగా స్థానిక నివాసితులు కమిషనర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కూకట్‌పల్లి నల్ల చెరువు తరహాలోనే దీనిని కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని వారు కోరారు.

* దోమల మోత: చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క కారణంగా దోమల ఉధృతి విపరీతంగా పెరిగిందని, కనీసం తలుపులు తీసే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దుర్వాసన: మురుగు నీరు చేరడంతో వస్తున్న దుర్గంధం వల్ల పరిసర ప్రాంతాల్లో జీవించడం నరకప్రాయంగా మారిందని వివరించారు.





**సాంకేతిక అనుమతుల నిరీక్షణ**

చెరువు పనుల జాప్యంపై కమిషనర్ అధికారులను ఆరా తీశారు. దీనిపై స్పందించిన పర్యవేక్షక అధికారులు.. హెచ్ఎండీఏ (HMDA) నుంచి రావాల్సిన సాంకేతిక అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు వేగవంతం చేస్తామని వివరించారు.

**అధికారులకు కీలక ఆదేశాలు**

* పరిస్థితిని గమనించిన కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు:
* తక్షణ చర్యలు: అనుమతులతో సంబంధం లేకుండా, తక్షణమే గుర్రపుడెక్కను తొలగించి, నిల్వ ఉన్న మురుగు నీటిని బయటకు పంపేలా చర్యలు చేపట్టాలి.
* కాలువ పనుల పరిశీలన: కాముని చెరువు నుంచి మూసాయి కుంటకు వెళ్లే వరద కాలువ నిర్మాణాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న సాంకేతిక లోపాలను నిర్మాణ దశలోనే సరిదిద్దాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.
* వార్షిక లక్ష్యం: ఈ వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి చేసి, చెరువులోకి స్వచ్ఛమైన నీరు చేరేలా చూడాలని స్పష్టం చేశారు.
* వరద ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులకు కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

# అసెంబ్లీ ముట్టడికి యత్నం: బీజేపీ నేతల ముందస్తు అరెస్టు

* **హయత్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ సహా పలువురు పోలీసుల అదుపులోకి**

హయత్‌నగర్, మార్చి 23 (భారత శక్తి) : రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్రశాఖ పిలుపునిచ్చిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు సోమవారం తెల్లవారుజామున బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు.

**పోలీస్ స్టేషన్‌కు తరలింపు:**

హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్‌ను పోలీసులు వారి నివాసాల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకుడు భరత్ తదితరులను ముందస్తుగా అరెస్టు చేసి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.




**ప్రజాస్వామ్య హక్కుల హరణే: బీజేపీ**

ఈ సందర్భంగా అరెస్టు అయిన నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. శాంతియుతంగా చేపట్ట తలపెట్టిన అసెంబ్లీ ముట్టడిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజా పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ముందస్తు అరెస్టుల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.




# అనాథ గృహానికి రూ. 60 వేల రూపాయల పుస్తకాలు, రేషన్ విరాళం

ఎల్బీనగర్, మార్చి 23 (భారత శక్తి): జర్మనీలో ఉంటున్న నాయుడు బుద్ధ, అమెరికాలో ఉంటున్న దుర్గ మిత్రులు కలిసి సోమవారం ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 60 వేల విలువల గల రేషన్,నోట్ బుక్స్ పోటీ పరీక్షల బుక్స్ ను గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ సమక్షంలో విరాళంగా అందచేశారు .ఈ సందర్భంగా నాయుడు బుద్ధ మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుతమైన వసతి గృహమని ,కమిటీ వారు అనాథ పిల్లలను చేర దీసి వారికి భోజన, వసతి, విద్యా, వైద్య, సకల సౌకర్యాలు కల్పించి, వారి భవిష్యత్తుకు నిరంతరంగా కృషి చేస్తున్నారని తెలిసి వ్యక్తిగతంగా సందర్శించినప్పుడు, వారి కోరిక మేరకు విద్యార్థులకు రేషన్, బుక్స్ ను అందచేశామని తెలిపారు.అమెరికాలో ఉంటున్న నా మిత్రురాలు దుర్గకు విద్యార్థుల అవసరాలు తెలియచేయగానే ,ఆమె కూడా ఈ విరాళంలో భాగస్వామ్య అయ్యారని తెలిపారు.అనంతరం నాయుడు బుద్ధ, గీత దంపతుల కుమారుడు ప్రణయ్ 18 వ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేకమైన విందు భోజనం ఏర్పాటు చేశారు.

# హిందూ సమాజం సంఘటితమైతేనే దేశాభివృద్ధి

* **హయత్ నగర్ సమ్మేళనంలో కళ్లెం నవజీవన్ రెడ్డి**

హయత్ నగర్, మార్చి 23 (భారత శక్తి): హిందూ సమాజం ఐకమత్యంగా ఉండి, ధర్మబద్ధంగా వ్యవహరించినప్పుడే దేశం శక్తివంతంగా మారుతుందని హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సూర్య నగర్ కాలనీలో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందూ సమాజంలో ఏకాత్మతను చాటడం, స్వధర్మం పట్ల అవగాహన కల్పించడం లక్ష్యంగా జరిగిన ఈ సభలో ఆయన కీలక ప్రసంగం చేశారు.

* **సంస్కృతి పరిరక్షణలో యువత పాత్ర కీలకం**


ప్రతి ఒక్కరూ తమ మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించుకోవాలని నవజీవన్ రెడ్డి సూచించారు. దేశభక్తి, సేవాగుణం కలిగిన సమాజాన్ని నిర్మించడంలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. యువతలో ధర్మబద్ధత పెంపొందించడం నేటి కాలంలో అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు.



* **లవ్ జిహాద్‌పై అప్రమత్తత అవసరం**

సమాజంలో చోటుచేసుకుంటున్న కొన్ని పోకడల పట్ల హిందూ సమాజం అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

* మోసపూరిత ప్రేమ: లవ్ జిహాద్ వంటి అంశాలపై యువత జాగ్రత్తగా ఉండాలని, ప్రేమ పేరుతో జరిగే మోసాలకు గురికావద్దని హెచ్చరించారు.
* నైతిక విలువలు: ఏ సంబంధమైనా పరస్పర గౌరవం, నిజాయితీపై ఆధారపడాలే తప్ప బలవంతం లేదా మోసం ఉండకూడదని స్పష్టం చేశారు.



* **తల్లిదండ్రుల బాధ్యత.. సమాజ చైతన్యం**

పిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నవజీవన్ రెడ్డి కోరారు. "పిల్లలతో తగిన సమయం గడుపుతూ వారికి సరైన మార్గదర్శనం చేయాలి. ఇంట్లోనే ధర్మం పట్ల అవగాహన కల్పించాలి. సమాజంలో చైతన్యం పెరిగినప్పుడే అరాచకాలను అడ్డుకోగలం" అని ఆయన వ్యాఖ్యానించారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెరిగినప్పుడు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడం సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

Penta Reddy Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 1-173, Naidupeta,Gandhi Chowk (Post), Khammam – 507003, Telangana. Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50962,Editor: Kesaram Penta Reddy